www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 మార్చి 2024
5
చిత్తూరు

ప్రశాంతంగా గ్రూప్ 1పరీక్షలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 1 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ హాలులో జిల్లా ఎస్పీ జాషువా, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డి ఆర్ ఓ బి పుల్లయ్యలతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జిల్లాలో మూడు కేంద్రాలలో నిర్వహించిన గ్రూప్ - 1 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు. మొత్తం 2,517 మంది అభ్యర్థులు మూడు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించామన్నారు. పేపర్ -1 ఉదయం,10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎస్ వి సెట్, ఆర్‌విఎస్ నగర్‌లో 982 మంది విద్యార్థులకు 644 మంది పరీక్షకు హాజరయ్యారు. సీతమ్స్ కాలేజీ, చిత్తూరు 840 మందికి 518 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, పివికెఎన్ డిగ్రీ కళాశాల, చిత్తూరులో 695 మంది విద్యార్థులకు 348 మంది పరీక్షకు హాజరయ్యారు. పేపర్ -2 మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు, ఎస్‌వి సెట్, ఆర్‌వి ఎస్ నగర్‌లో 982 మంది విద్యార్థులకు 643 మంది పరీక్షకు హాజరయ్యారు. సీతమ్స్ కాలేజీ, చిత్తూరు 840 మందికి 518 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, పివికెఎన్ డిగ్రీ కళాశాల, చిత్తూరులో 695 మంది విద్యార్థులకు 341 మంది పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు.

అమలులో ఎన్నికల కోడ్

- కొత్త ఓటర్లు 36,083
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 415
- వాలంటీర్లు ఎన్నికల విధులకు దూరం
- జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ ఎస్ షన్మోహన్

మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ షన్మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ మేరకు సార్వత్రిక ఎన్నికలు 2024 ను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం పూర్తిగా సంసిద్ధమైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ షన్మోహన్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికలు - 2024 షెడ్యూలు విడుదల చేసిన నేపథ్యంలో ఆదివారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, ఎస్ పి జాషువా, జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, డిఆర్‌ఓ బి పుల్లయ్య తో కలిసి ఎన్నికల సన్నద్ధత, నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపడుతున్న కార్యాచరణ వివరాలు వెల్లడించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నెల 18వ తేది విడుదల చేయనున్నట్లు తెలిపారు. నామినేషన్స్ స్వీకరణ ఏప్రిల్ 25వ తేది నుండి చేపడుతారని, 26న నామినేషన్ల పరిశీలన, 29వ తేది నామినేషన్ల ఉపసంహరణ, మే 13 వ తేది పోలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. కౌంటింగ్ జూన్ 4వ తేది ఉంటుందని జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక్క పార్లమెంట్ నియోజవర్గానికి ఎన్నికలు జరగనున్నాయని చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 15,56,247 మంది ఓటర్లు వున్నారని ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఓటర్ల నమోదు కోసం వచ్చి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించారని వెయ్యి నుండి రెండు వేల ఓట్లు అదనంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 15,56,247 మంది ఓటర్లలో పురుషులు 7,66,440, స్త్రీలు 7,89,732,థర్డ్ జెండర్ 75 మంది ఉన్నారని, 18-19 సంవత్సరాల వయస్సు ఉండి కొత్తగా నమోదైన ఓటర్ల 36,083 కాగా ఇందులో పురుషులు 19,766, స్త్రీలు 16,317 ఓటర్లు కాగా వికలాంగుల ఓటర్లు 23,503 మంది ఉన్నారు. 85 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు గల ఓటర్లు 5,167 మంది వున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ సర్వీస్ ఓటర్లు మొత్తం 3,375 కాగా ఇందులో పురుషులు 3,320, స్త్రీలు 55 మంది వీరందరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా పోస్టల్ బ్యాలెట్ అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లు 1,771 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అర్బన్ 362, రూరల్ 1400 కాగా 1,266 ప్రాంతాల్లో ఈ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్లిష్టమైన (క్రిటికల్) పోలింగ్ స్టేషన్ల 415 గుర్తించామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వీడియో చిత్రీకరణ, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ర్యాంపు, మంచి నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో నియోజక వర్గానికి మూడు చొప్పున ఫ్లేయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు, అంగన్‌వాడీ, ఆశా, వాలంటీర్లకు ఎన్నికల విధులు కేటాయించడం లేదని స్పష్టం చేశారు. ఎస్పీ జాషువా మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికలను నిర్వహించడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే జిల్లాలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి డిఎస్పీ స్థాయి అధికారులు పరిశీలించారని తెలిపారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో పోలీస్ శాఖ ద్వారా 16 చెక్ పోస్ట్ ల ఏర్పాటు చేశారని, 235 బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇప్పటి వరకు రూ.1.3 కోట్ల నగదు సీజ్ చేయడంతో పాటు 514 కేసులు నమోదు చేసి 8,300 లీటర్లు లిక్కర్‌ను సీజ్ చేశామని, జిల్లాలో ఎలాంటి అలజడులు జరగ కుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి కేంద్రం నుండి మూడు కంపెనీలు, సిఆర్‌పిఎఫ్, ఏపి ఎస్‌పి, రిజర్వు పోలీసు బలగాలు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు ప్రచారం, సమావేశాల నిర్వహణకు ముందస్తుగా సంబంధిత సబ్ డివిజనల్ పోలీసు అధికారి నుండి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిబంధనలు

వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర ఎన్నికల అధికారితో కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా మౌలిక సదుపాయాలు చేపడుతున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ షన్మోహన్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కు వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు బహిరంగ స్థలాలలో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లను నేటి మధ్యాహ్నం 3 గంటల లోపు తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న ఎన్నికల కసరత్తును కలెక్టర్ ఈ కాన్ఫరెన్స్‌లో వివరించారు. జిల్లా వ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సీ విజిల్ లో నమోదయ్యే ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం ప్రపోజల్స్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 18 నోటిఫికేషన్ జారీకి కసరత్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఈసీకి వివరించారు.

నేటి నుండి పది పరీక్షలు

- జిల్లాలో 116 పరీక్షా కేంద్రాలు
- పరీక్షలకు హాజరుకానున్న 22,594 మంది విద్యార్థులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:
సోమవారం నుండి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా 116 పరీక్షా కేంద్రాల్లో 22,594 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో విద్యార్థులు 11,767, విద్యార్థినులు 10,827 మంది ఉన్నారు. ఉదయం 9.30 గంగల నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షా సమయం. పది పరీక్షలకు 22,119 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరుకానున్నారు. గత సంవత్సరం ఫెయిల్ అయిన 1,395 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ 6 బృందాలు

పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ చోటు చేసుకోకుండా 6 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 116 సిటింగ్ స్క్వాడ్, 1,096 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఉదయం పరీక్ష సమయానికి ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. హాల్ టికెట్‌ను పరిశీలించుకోవడంతో పాటు ఇన్విజిలేటర్ ద్వారా హాల్ టికెట్ ఆధారంగా కేటాయించిన సీటు ముందుగా తెలుసుకోవాలి.

ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు..

విద్యార్థులు ఎవరూ ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర వస్తువులు పరీక్ష హాలుకు తీసుకు వెళ్లకూడదు. ప్రతి విద్యార్థి పరీక్ష సెంటర్ కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటున్నాయి. తప్పని సరిగా విద్యార్థులు హాల్ టికెట్ ను సదరు ఆర్టీసీ వారికి చూపించాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వహణ సిబ్బంది, చీఫ్ సూపరింటెండెట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్, అటెండర్స్, స్వీపర్స్, వాటర్ బాయ్స్, పోలీస్ వారు ఎవరూ సెల్ ఫోన్లతో పరీక్ష హాలుకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో చోటు చేసుకున్న పేపర్ లీకేజీ సంఘటలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ఎలాంటి సంఘటనలూ చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్ష హాలులో మాస్ కాపీయింగ్ కు వీలు లేకుండా ప్రశ్నా పత్రాలపై భార్ కోడ్ ను ముద్రించారు. ఎక్కడైనా ఇలాంటి లోపాలు తెలిసిన వెంటనే భార్ కోడ్ ద్వారా ఏ సెంటర్ లో ఏ రూమ్‌లో ఏ విద్యార్థి మాస్ కాపీయింగ్ కు పాల్పడుతున్నారో తెలిసిపోతుంది. ఏ సెంటర్లలోనైనా మాస్ కాపీయింగ్, ఇతర సమస్యలు తలెత్తితే ఏపీటి 25 ఆఫ్ 1997 శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 116 పరీక్షా కేంద్రాల్లో ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించేలా జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 9032185001 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

బాక్సింగ్‌లో రెండు పతకాలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:
బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలో తిరుపతి జిల్లాకి రెండు పతకాలు దక్కాయి. తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ విశాఖపట్నంలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగిన బాక్సింగ్ రాష్ట్ర పోటీలలో తిరుపతికి ఎంజీఎం హై స్కూల్‌కి చెందిన వి.జోష్ణ 61కేజీ బాలికల విభాగంలో కాశ్య పథకం సాధించగా, 64 కేజీల బాలుర విభాగంలో గీతాంజలి హైస్కూల్‌కి చెందిన కే.నిరంజన్ సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, తిరుపతి బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్.హేమ్ కుమార్, కార్యదర్శి పి.కైలాష్, తిరుపతి డిఎస్‌డిఓ సయ్యద్ పాల్గొని, అభినందనలు తెలిపారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు..

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చంద్రబాబు హామీలను నమ్మేవారు లేరని మంత్రి పెద్దరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాళ్యం మండలంలో మండల కన్వీనర్ పి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారం కోసం 2014లో 600 హామీలు, 100 పేజీల మేనిఫెస్టోని ప్రవేశపెట్టారని 2014 -2019 వరకు హామీలను నెరవేర్చకపోగా ప్రజలు తిరస్కరిం చారన్నారు. తిరిగి అధికారం కోసం తప్పుడు హామీలతో అధికారం చేపట్టేందుకు వస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి 2019లో ప్రవేశపెట్టిన హామీలను 99 శాతం పూర్తి చేసి ప్రతి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగి వుంటే జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ప్రతి కుటుంబ సభ్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో లబ్ధి పొందారని ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్, ఎంపీ అభ్యర్థి రెడ్డప్పను గెలిపించాలన్నారు. ఐరాల, తవణంపల్లి, బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ కార్యక్ర మం లో జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జయ కుమార్, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వికసిత్ భారత్- 2047పై దిశానిర్దేశం

ప్రజాశక్తి- ఎస్‌వియు క్యాంపస్:
జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ ఆర్ జోషి విచ్చేసి 'వికసిత భారత్ -2047 ఇంట్రాక్షన్ విత్ యూత్ అండ్ మోటివేషన్' కార్యక్రమం పై ఆయన విద్యార్థుల్లో వికసిత భారత్ అనే అంశంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047వ సంవత్సరానికి భారతదేశం ఏవిధంగా వికాసించాలి? దానికి ప్రత్యేకించి యంగ్ మైండ్స్ ఉన్నవారికి సూచనలు, సలహాలు తెలుపుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడపడానికి అందరూ కృషి చేయాలన్నారు. భారతదేశ యువత చక్కగా చదువుకుని దేశం వికాసానికి, దేశ సంస్కృతి సంరక్షణకు నడుం బిగించి ముందుకు వెళ్లాలని తెలిపారు. విసి ప్రొఫెసర్ జిఎస్‌ఆర్ కృష్ణమూర్తి యువత ద్వారానే భారతదేశం వికసిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో యుజిసి డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ శాలిని, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ, ప్రోక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యక్షులు ప్రొపెసర్ చంద్రశేఖరం, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరులో పోరు..తొలినాళ్ల నుంచే జోరు..!

- తొలి విజయం జర్నలిస్టుదే..
- హ్యాట్రిక్ విజయాలతో సాగుతున్న పెద్దిరెడ్డి
- 2024లో విజయం ఎవరిదో?
- మలిదశ ప్రస్థానం తండ్రీతనయులదే..
- విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు

పుంగనూరులో నియోజకవర్గంలో ఎన్నికల పోరు..తొలినాళ్ల నుంచే జోరుగా సాగుతోంది. ఆ నియోజకవర్గ ప్రారంభ ఎన్నికల్లో జర్నలిస్టు విజయం సాధించగా మలి దశ ఎన్నికల్లో తండ్రీ కొడుకులైన ఎన్ రామకృష్ణారెడ్డి, అమర్‌నాథ్ రెడ్డీలు విజయ ప్రస్థానం సాగించారు. ఆ తర్వాత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ విజయాలతో ముందుకు సాగుతున్నారు. 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అధికార, ప్రతిపక్షాలు పావులు కదుపుతున్నాయి. ఈ ఎన్నికల్లో అంతిమ విజయం ఎవరిదో ఓటర్లే తేల్సాల్సి వుంది.

ప్రజాశక్తి -పుంగనూరు: చిత్తూరు జిల్లా పరిధిలో పుంగనూరు నియోజకవర్గం ఉన్నా అన్నమయ్య జిల్లా పరిధిలోని రాజంపేట పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల ఆరు మండలాలు వున్నాయి.

ఓటర్లు

పుంగనూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,38,189 వుండగా పురుషులు 1,16,997 మంది, మహిళలు 1,21,184 మంది ఓటర్లు, థర్డ్ జండర్లు ఎనిమిది మంది ఓటర్లు వున్నారు.

ఎన్నికల చరిత్ర

జమీందారులు ఆధిపత్యం వహించిన చరిత్ర పుంగనూరుకు వుంది. తొలిసారి1952 ఎన్నికలు జరిగినప్పుడు ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు, గాంధేయ వాది, రచయిత, జర్నలిస్టు అయిన బాడాల కృష్ణమూర్తి రావు కాంగ్రెస్ అభ్యర్థిగాను, సదుం నివాసి అతి పెద్ద భూస్వామి అయిన వి రఘునాథ్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో జమీందారీ కుటుంబ సభ్యులు బాడాల కృష్ణమూర్తి రావుకు ప్రచార కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు. రఘునాథ్ రెడ్డి కూడా మంచి పట్టు ఉండడంతో వీరి మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. అప్పటి పోరులో బాడాల కృష్ణమూర్తి రావు 1300 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

పుంగనూరు నియోజకవర్గంలో 1952 నుంచి 2019 వరకు 17 సార్లు జరిగిన ఎన్నికలు ఎన్నికల్లో అత్యధికంగా45 ఏళ్ల పాటు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలే గెలుస్తున్నారు. 1985 నుంచి వరుసగా రెడ్డి సామాజివర్గం వారు ఎమ్మెల్యేగా ఎన్నికవుతున్నారు. తండ్రీ కొడుకులైన ఎన్ రామకృష్ణారెడ్డి, అమర్ నాథ్ రెడ్డిలు ప్రాతినిథ్యం వహించడం విశేషం. రామకృష్ణా రెడ్డి మొదట ఈ నియోజకవర్గంలో హ్యాట్రిక్ కొట్టగా 1985 నుండి 1996 వరసగా మూడు గెలిచారు. 1996లో చిత్తూరు పార్లమెంటు స్థానానికి టిడిపి తరపున ఎంపీగా ఎన్నికయ్యారు. రెండోసారి 1998 మధ్యంతర ఎన్నికల్లోనూ, 1999లో ఎన్నికల్లో మూడోసారి ఎంపీగా గెలుపొంది అప్పటి చిత్తూరు జిల్లాలో తిరుగులేని నాయకుడుగా హ్యాట్రిక్ సాధించాడు. 2009నుండి 2019 ఎన్నికలలో గెలిచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ కొట్టారు.

2014లో ఫలితాలు

2014 ఎన్నికల్లో వైసిపి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టిడిపి నుంచి వెంకటరమణ రాజు పోటీ పడగా పెద్దిరెడ్డి గెలిచారు. పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి 1,04,587 (56.47శాతం) ఓట్లు రాగా, వెంకటరమణ రాజుకు 72,856 (39.34) ఓట్లు వచ్చాయి. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి 31,731 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

2019 ఫలితాలు

2019 ఎన్నికల్లో వైసిపి తరుపున పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి పోటీ చేయగా, టిడిపి నుంచి అనీషా రెడ్డి బరిలోకి దిగారు. అయితే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనీషా రెడ్డిపై 42,710 ఓట్ల తేడాతో గెలిచారు. పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి 1,07,431 (54.85 శాతం) అనీషా రెడ్డికి 63,876 ఓట్లు లభించాయి.

కులాల లెక్కలు

నియోజకవర్గంలో యాదవులు, మైనారిటీలు, కాపులు, రెడ్డి, కురబ, వాల్మీకి కులస్తులు అధికంగా ఉన్నారు.

పార్టీల బలాబలాలు

వైసిపి: 2014లో ఆవిర్భావం నుంచి జరిగిన రెండు ఎన్నికల్లో జయకేతనం ఎగురవేసింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ పటిష్టమైన కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నేతలు ఈ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి వైసిపికి మారడంతో పార్టీ నియోజక వర్గంలో పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్నాడు.

టిడిపి: బలహీన వర్గాలకు చెందిన బగ్గిడి గోపాల్ తో ప్రారంభమైన టిడిపి విజయపరంపర నూతన కాల్వ రామకృష్ణా రెడ్డి రాకతో 2009 నియోజక వర్గాల పునర్విభజన వరకు పూర్తి ఆధిపత్యం కొనసాగింది. ఎన్ రామకృష్ణా రెడ్డి హ్యాట్రిక్ సాధించగా, ఆయన తనయుడు అమరనాథ్ రెడ్డి వరుసగా రెండుసార్లు గెలిచారు. అయితే నియోజక వర్గాల పునర్విభజనలో అమరనాథ్ రెడ్డి సొంత మండలం పెద్దపంజాణి పలమనేరు నియోజకవర్గానికి మారడంతో టీడిపి గత మూడు ఎన్నికల్లో ఓటమి చవిచూస్తోంది. టిడిపికి కేడర్ ఉన్నా ముందుండి నడిపించే నేత లేకపోవడంతో ప్రతిసారి విఫలమవుతోంది.

అభ్యర్థుల బలాబలాలు

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వరుసగా మూడు సార్లు నెగ్గి నాలుగవ సారి కూడా గెలిచి తన ఆధిపత్యం నిరూపించుకునేందుకు సిద్ధం అయ్యారు. ప్రతి ఆరు నెలలకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ పర్యటిస్తూ ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకుని పరిష్కరించడం ఆయన నైజం. ఈ విషయంలో ఆయన ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో పెద్దిరెడ్డి ఉంటారు అనడంలో అతిశయోక్తి లేదు. తన కోసం ఏమి చేయడానికైనా తెగించే కార్యకర్తలు పెద్దిరెడ్డి సొంతం.

టిడిపికి ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా చల్లా బాబు వ్యవహరిస్తున్నారు. దూకుడు స్వభావం, తనకంటూ ప్రత్యేక అనుచరులను చల్లా బాబు కలిగి ఉన్నారు. అయితే నియోజకవర్గం మొత్తం కలియ తిరిగే పరిస్థితి లేదు. ఇటీవల చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటన సందర్భంగా జరిగిన గొడవలో చల్లా బాబు టార్గెట్ గా ప్రభుత్వం కేసులు పెట్టింది. పెద్దిరెడ్డిని ఓడిస్తామంటూ చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించినా ఆ శబదం ఎంతవరకు పని చేస్తుందో వేచి చూడాల్సిన అవసరం ఉంది.

భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకుడు రామచంద్ర యాదవ్ పుంగనూరు నుంచి బరిలో దిగనున్నారు. 2019లో జనసేన తరుపున పోటీ చేసి 16వేల ఓట్లు పొందారు. వైసిపి సీనియర్ నేత, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించడం తో వార్తల్లో నిలిచారు. పెద్దిరెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు యాదవ్ చేయడంతో ఆయన అనుచరులు రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. దాడిని చూపిస్తూ కేంద్ర హోం మంత్రిని కలిసి వై కేటగిరి భద్రత పొందారు. రైతు, యువకులకు సాయం పేరిట రామచంద్ర యాదవ్ ప్రజల్లోకి వెళ్లేందుకు యత్నించినా శాంతి భద్రతల సమస్య ఉత్పన్నం పేరుతో పోలీసులు యాదవ్‌ను కాలు కదపనివ్వడం లేదు. దీంతో రామచంద్ర యాదవ్ నియోజకవర్గంలో యథేచ్ఛగా తిరగులేని పరిస్థితి తరచూ అప్పట్లో వుండేది.

పొత్తు ప్రభావం

తెలుగుదేశం - జనసేన పొత్తు ప్రభావం పెద్దగా ప్రభావం చూపే పరిస్థితి లేదు. బలిజ సామాజికవర్గం ఓట్లు గణనీయంగా ఉన్నా సరైన నాయకత్వాన్ని ఇవ్వడంలో జనసేన విఫలం అయింది . ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పుంగనూరులో త్రిముఖ పోటీ ఏర్పడింది. అయితే వైసిపి మాత్రం అన్ని రకాల ముందంజలో ఉంది. ఎన్నికలకు అవసరమైన అన్ని సిద్ధం చేసి వైసిపి మండల నేతలు, కార్యకర్తలు అటు మండలంలోని ఇటు మున్సిపాలిటీలను కలియ తిరుగుతూ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో ఎదుర్కోవడానికి ఇతర పార్టీలకు ఉన్న బలాబలాలతో పోలిస్తే కష్టమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఓవైపు అభివృద్ధిని చూపిస్తూ మరోవైపు ఓటరుకు అవసరమైన తాయిలాలు ఇవ్వడానికి సిద్ధం కావడం గమనార్హం.

ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల పోరులో తుది విజయం ఎవరిదో ఓటర్లే నిర్ణయించాల్సి వుంది.

'స్పందన' రద్దు: కమిషనర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించే "స్పందన" కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ డా. జె అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్పందనా కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించాలన్నారు.

మూగ జంతువులకు లేని వైరం.. మానవులకు ఎందుకో?!

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మూగ జంతువులకు లేని విరోధం మనుషు లకు ఎందుకని శనివారం రాత్రి తమిళనాడు దాబా వద్ద పిల్లి, శునకం ఆట్లాడుకుంటూ కనిపించడం పలువు రిని ఆశ్చర్య చకితుల్ని చేసింది. 'మనుషులుగా పుట్టాం.. మనుషులు గా మెలుగుదాం..' అనే ఆలోచన మనుషులకు లేదని జంతువులు వేరు జాతి అయినా చేరదీసి ఒకటిగా ఉన్నాయని మూగజీవులను చూసి మనుషులుగా మెలగాలి అనే ఉద్దేశం మనుషుల్లో రావాలని పలువురు పేర్కొన్నారు.

జిడి నెల్లూరులో 4,641 మంది కొత్త ఓటర్లు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు శాసనసభ ఎన్నికల్లో ఈ సారి 4,641 మంది యువత ఓటు హక్కు వినియోగించుకోనున్నారని అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి రవి తెలిపారు. గంగాధరనెల్లూరు తహశీల్దారు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,01697 , మహిళా ఓటర్లు 1,02, 966, ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఆరు ఉన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ మొత్తం 2,04,669 మంది ఓటర్లు ఉన్నారన్నారు. శనివారం నుంచి ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని రాజకీయ పక్షాలు ప్రజలు నియమావళిని అతిక్రమించకూడదని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దారులు తులసీరామ్, విజయకృష్ణ, ఎఎస్వో షణ్ముగంనాయుడు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడిపల్లి మండలంలోని పి. బి.వాడ గ్రామ పంచాయతీ పరిధిలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఆదివారం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ టిడిపికి ఓటు వేయాలని.. అభ్యర్థించారు. చంద్రబాబు నాయుడు విజయమే ధ్యేయంగా గడపగడపకు వెళ్లి ప్రచారం చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.ఎం. బాబు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బెటప్ప నాయుడు, మాజీ సర్పంచ్ హేమంబర్ గౌడు, యూనిట్ ఇన్‌ఛార్జి రామచంద్ర, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు సుబ్రమణి, నాయకులు గోవిందస్వామి, వెంకటేష్, నారాయణస్వామి, జనసేన నాయకుడు అమీర్ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

రామకుప్పం: కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే గా చంద్రబాబు నాయుడుని సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీ ఎర్ర చేన్లు గ్రామంలో ఇంటింటికి టిడిపి ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాల పేద ప్రజలు అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని... చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ముఖ్యంగా రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు, డ్రిప్ ఇరిగేషన్లు, బ్యాంకు రుణాలు తదితర వాటికి శ్రీకారం చుట్టారన్నారు. మహిళలకు స్వయం సకార సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు అందించి కుట్టు మిషన్లు చేనేత కార్మికులకు పనిముట్లు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, నేతలు హనుమంతు ,శీను పాల్గొన్నారు.

చిత్రాల ద్వారానే సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవచ్చు: విష్ణు

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చిత్రాల ద్వారానే భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, జీవన విధానాలను భావితరాలకు అందించవచ్చని మంచు విష్ణు అన్నారు. ఆదివారం ఏ రంగంపేటలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో విష్ణు ఆర్ట్స్ ఫౌండేషన్ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంచు మోహన్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ చిత్రాల ద్వారానే మన పూర్వీకుల జీవనశైలిని తెలుసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన చిత్రకారులు పాల్గొన్నారు. మార్చి 19న మోహన్ బాబు జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ చిత్ర కళాకారులను సన్మానించడం జరుగుతుందని మంచు విష్ణు తెలిపారు. మోహన్‌బాబు యూనివర్సిటీలోని విద్యార్థులకు చిత్ర కళాకారులు గీసిన చిత్రాల ద్వారా మన పూర్వీకుల జీవన శైలిని తెలుసుకోగలుగుతున్నామని మన భవిష్యత్తు తరాలకు కూడా ఈ చిత్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మోహన్ బాబు మాట్లాడుతూ శ్రీ విద్యానికేతన్ విద్యాసంస్థలు 31 సంవత్సరాలలో మోహన్ బాబు యూనివర్సిటీగా ఎదగడానికి ప్రతి ఒక్కరి సమిష్టి కృషి కారణమని తెలిపారు. అతి త్వరలోనే భారతదేశంలోనే అతి గొప్ప కళాశాలగా మోహన్ బాబు యూనివర్సిటీ పేరు పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో త్వరలో ఆర్ట్స్ అండ్ పెయింటింగ్ కోర్సులను కూడా నెలకొల్పుతామని ఆయన తెలిపారు. రాజకీయాల గూర్చి విలేకరులు ప్రశ్నించగా ప్రశాంతమైన జీవితం గడుపుతున్నానని మాట దాటవేశారు.

క్రికెట్ పోటీల్లో విజేతలుగా మస్తాన్ జట్టు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: టిటిడి క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్లో మస్తాన్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక తారకరామా స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిర్ణీత 15 ఓవర్లలో165/3 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ దిగిన ప్రత్యర్థి జట్టు 134/5 ఓటమి చెందింది. ఫైనల్ మ్యాచ్లో సెంచరీ సాధించిన కెప్టెన్ మస్తాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది.

దేశద్రోహులని తిట్టిన నోటితోనే ప్రశంసలా..

సాయిప్రసాద్‌రెడ్డి ధ్వజం

ప్రజాశక్తి-కోట: ప్రధాని మోడీ దేశద్రోహి, ఎగతాళి చేసిన చంద్రబాబు ప్రస్తుతం ప్రశంసలు కురిపించడం సిగ్గుచేటని వైసీపీ యువనాయకులు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన నివాసంలో మాట్లాడుతూ మోడీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఎన్ని కుట్రలు పన్నినా విజయం వైఎస్ జగన్‌దేనన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ప్రజలందరూ క్షుణ్ణంగా ఆలోచించి మోసపోకుండా సక్రమంగా పరిపాలన చేసే నాయకుడిని ఎంచుకోవాలన్నారు. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో జీవించాలంటే అధికారంలోకి వైసీపీ పార్టీని తీసుకురావాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కోట: మండలంలోని గూడలి పంచాయతీ ప్రకాశం కాలనీకి చెందిన నారాయణకు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణకు ప్రతి నెలా రూ.వెయ్యి ఇస్తానని దాత ఓరుగంటి ఫనేంద్రకుమార్, అల్లం రమణయ్య హామీ ఇచ్చారు.

విజయమే లక్ష్యం: హేమంత్ రాయల్

ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్‌రాయల్ అన్నారు. ఆదివారం చంద్రగిరి పార్టీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు త్యాగరాజు, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు..

ఎఆర్వో, కమిషనర్ డా. జె అరుణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : నగరంలో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ డాక్టరు జె అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. నగరంలో ఎన్నికల కోడ్ అమలవుతున్న తీరుపై ఆదివారం ఉదయం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టారు. వాటర్ ప్లాంట్ వద్ద రాజకీయపరమైన పెయింటింగ్స్ కనిపించకుండా చేయాలని, పార్టీల జెండాలు తొలగించాలన్నారు. ఎక్కడా రాజకీయపరమైన పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లు ఉండరాదన్నారు. గోడలపై రాసిన రాతలను, బొమ్మలకు పూర్తిస్థాయిలో తెల్ల పెయింట్ పూయాలన్నారు. నగరంలోని చర్చి వీధి, పలమనేరు రోడ్డు, తిరుపతి రోడ్డు, వేలూరు రోడ్, ఎమ్.జి.ఆర్ వీధి, సి బి రోడ్, పుత్తూరు రోడ్డు, గాంధీ రోడ్, కొంగారెడ్డిపల్లి ప్రాంతాల్లో కమిషనర్ తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ భవనాలు కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఏమైనా ఫిర్యాదులు వస్తే సత్వరం స్పందించడానికి వీలుగా మొబైల్ బందాలను ఏర్పాటు చేయించారు. ఎన్నికలకు సంబంధించిన విధులను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఏసీపీ రామకృష్ణుడు, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, సీఎంఎం గోపి, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకానాథం ఉన్నారు.

ప్రజాశక్తి- పలమనేరు: ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలని పలమనేరు ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి ఆర్‌డిఓ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందువల్ల బహిరంగ ప్రదేశాల్లోనూ, గవర్నమెంట్ ఆఫీసుల్లోనూ రాజకీయ పార్టీలకు సంబంధించిన చిత్ర పటాలు గానీ, లోగోలు గాని , ఫ్లెక్సీలు గానీ ఏమి ఉండకూడదని, పలమనేరు నియోజకవర్గం లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తగిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు, విలేకరులు సహకరించాలని కోరారు. మొత్తం ఓటర్లు 266,739 మంది వున్నారు. ఇందులో పురుషులు 1,32,0 20 మంది, స్త్రీలు 1,34,719 మంది , మొత్తం పోలింగ్ స్టేషన్లో 288, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు 87 ఉన్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న పలమనేరు ఆర్డిఓ మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి చిత్తూరు డెస్క్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారి నగరి ఆర్డీవో వెంకటరెడ్డి, నియోజకవర్గ సెక్యూరిటీ అధికారి, డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అన్ని పార్టీలకు సంబందిత ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించామన్నారు. పార్టీ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్దంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. సరిహద్దులో ఇప్పటికే పటిష్ఠమైన భద్రత ఉందని నగదు, ఆభరణాలు పరిమితిలోపే తీసుకెళ్లాలని వాటికి కూడా సరైన బిల్లులు ఉండాలన్నారు.

కాంగ్రెస్‌లోనే కొనసాగుతా..

రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పార్థసారథి రెడ్డి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పార్థసారధి రెడ్డి బైరెడ్డిపల్లి మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ మండల కాంగ్రెస్ ప్రసిడెంట్ ధనంజయ గౌడు అలియాస్ డాన్ ఆధ్వర్యంలో. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి జనార్ధన్ గౌడ్ ఆశీస్సులతో 2014లో నియోజకవర్గ నుంచి పోటీ చేసిన తాను ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ఇందులో భాగంగానే రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి కాంగ్రెస్ మ్యానుఫ్యాక్చర్‌లో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకొస్తే మహాలక్ష్మి పథకం అమలు చేస్తుందన్నారు. ప్రతి పేద కుటుంబ మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయలు అందిస్తామని అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని మండల కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ధనంజయ గౌడు, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ వై.యం శ్రీనివాసులు, జిల్లా యూత్ సెక్రెటరీ కే హరినాథ్ రెడ్డి, మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు మహేంద్ర, రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పార్థసారథి రెడ్డి

సచివాలయాలు ఏర్పాటు చేసిన ఘనత జగన్‌దే: మంత్రి

ప్రజాశక్తి - తవణంపల్లి: సచివాలయాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా వైసిపి నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డా. సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భారీ బహిరంగ సభనుద్దేశించి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గం లో తవణంపల్లి మండలం అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని, ఈ ఐదు సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకం ద్వారా ప్రజలు లబ్ధి పొందారని రానున్న ఎన్నికల్లో మరలా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకుంటే రానున్న ఐదు సంవత్సర కాలంలో మరింత సంక్షేమ పథకాల ద్వారా ఈ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉంటారని తెలిపారు. చంద్రబాబు 2014లో మేనిఫెస్టో లో చెప్పిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని అదే ముఖ్యమంత్రి చెప్పిన హామీలన్నీ సంక్షేమ పథకాల ద్వారా 100 శాతం పూర్తి చేశారని గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి శాశ్వత ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అని, వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి 53,000 ఉద్యోగాలు కల్పించారని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్రంలో మూడు కోట్ల ధరల స్థిరీకరణ ఏర్పాటు చేశారని, పేదలకు 32 లక్షల ఇళ్ల పట్టాల మంజూరు చేసి 16 లక్షల ఇల్లు పూర్తి చేశారని, విద్యావ్యవస్థ రూపురేఖలు మార్చారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ ని, ఎంపీ రెడ్డప్పను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి సీనియర్ నాయకులు సుగుణాకర్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీ బాబు, పారిశ్రామిక వేత్త గురుకువారిపల్లి ప్రకాష్ రెడ్డి, మండల కన్వీనర్ సిద్దం పల్లి హరి రెడ్డి, ఎంపీపీ గీత హరికృష్ణ రెడ్డి, జడ్పిటిసి జిల్లా శ్రీ శిశు సంక్షేమ శాఖ చైర్మన్ భారతి మధు కుమార్, వైస్ ఎంపీపీలు పట్నం ప్రతాపరెడ్డి, శోభ బాబు రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పరమేశ్వర్ రెడ్డి,అరగొండ కిషోర్ రెడ్డి, వివేకానంద రెడ్డి, ఉమా శంకర్ రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ శరత్ రెడ్డి, జగన్నాథరెడ్డి, సుఖేష్ రెడ్డి, ఐటి విభాగం సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి

అంబేద్కర్ బహుజన సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్:

వడమాలపేట మండలంలో నూతనంగా అంబేద్కర్ బహుజన సంఘం ఏర్పాటైంది. ఆదివారం వడమాలపేటలో ఆత్మీయ సభ ఏర్పాటు చేశారు. ముందుగా మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి పాల్గొన్నారు. అనంతరం సంఘం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా హేమావతి, ఉపాధ్యక్షులుగా మాతయ్య, కార్యదర్శిగా మంజునాథ్, జాయింట్ సెక్రెటరీ ప్రవీణ్, కోశాధికారి వెంకటేష్, ఆదెయ్య, ఉప కోశాధికారి లోకనాథం చక్రవర్తి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మునిశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజయ్య, ముని తేజలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దాము, నితిన్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో పిల్లల పట్ల జాగ్రత్తలు అవసరం: డీఎస్పీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:

వేసవి సెలవుల్లో తల్లి దండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని డీఎస్పీ శ్రీనివాసరావు తెలి పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులపై నిఘా ఉంచాలన్నారు. వ్యస నాలకు బానిసలు కాకుండా, ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెరువులు, బావుల్లో ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆ మేరకు పిల్లల పట్ల జాగ్రత్తలు వహిస్తూ వారిని గమనిస్తూ ఉండాలన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కాకుండా ప్రమాదాలకు -కాకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

బిఆర్ఎస్‌కు ఆర్కాట్ కృష్ణప్రసాద్ రాజీనామా

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఏపీ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు, కాపులకు న్యాయం చేస్తారనే ఉద్దేశంతో ఆ పార్టీల చేరడం జరిగిందని, అటువంటిది తెలంగాణ ఎన్నికలలో బిఆర్ఎస్ ఓడిపోవడంతో ఏపీ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులన్నీ పట్టించుకోకపోవడంతో నిరాశ చెంది ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను తెలుపుతానని పేర్కొన్నారు.

ప్రజల్లో మమేకం కావాలి

థామస్‌కు చంద్రబాబు దిశానిర్దేశం

ప్రజాశక్తి -గంగాధరనెల్లూరు: ప్రజల్లో మమేకం కావాలని గంగాధరనెల్లూరు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్‌కు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. 'రా..కదలిరా(విజయవంతానికి కృషి చేసినందుకు డాక్టర్ థామస్‌కు ఆయన అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లో మమేకం కావాలని, థామస్ ఇన్‌ఛార్జి కావడంతో పార్టీ బలోపేతమైందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు, డాక్టర్ థామస్ ఇద్దరి మధ్య సుమారు 50 నిమిషాల పాటు సంభాషణ సాగింది.

ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి: ఎమ్మెల్యే

సమావేశమైన వైసిపి నాయకులు

ప్రజాశక్తి -గంగవరం: ఈ సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే వెంకటే గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గంగవరం మండలం లయన్స్ క్లబ్ లో పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు మున్సిపాల్టీ, పలమనేరు రూరల్, గంగవరం మండల బూత్ కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. మళ్లీ ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కొనసాగాలంటే ఈ ఎన్నికలలో పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామ, బూత్ పరిధిలో ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మండల, పంచాయతీ నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసన్న వెంకటేశ్వర స్వామి ధ్వజారోహణం

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఆవులపల్లి గ్రామంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం భక్తుల మధ్య ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూల విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరణ చేసి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం వేద మంత్రాల నడుమ అర్చకులు స్వామివారి ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి గ్రామ భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం స్వామి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - రామకుప్పం: రానున్న సార్వత్రిక ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా నిర్వహించాలని కుప్పం గ్రామీణ సీఐ ఈశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బళ్ళ, కెంచనబల్ల, కొంగనపల్లి, కొల్లుపల్లి, తదితర ప్రాంతాల్లో సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని గుర్తించారు. మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. పార్లమెంటు, శాసనసభ ఎన్నికల లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివకుమార్, తహశీల్దార్ శ్రీధర్,డీటీ దిలీప్ కుమార్, ఎంపీడీఓ రాధాకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

ప్రజాశక్తి-కోట: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడబే లక్ష్యమని బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ గజేంద్ర అన్నారు. ఆదివారం కోట మండలంలోని శ్రీ కోటమ్మ తల్లి దేవస్థానంలో విద్యార్థులతో కలిసి పూజలు చేశారు.

అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్:

పట్టణ పరిధిలోని అడివయ్యకాలనీలో గల గాడ్ గ్రేస్ సొసైటీ వృద్ధాశ్రమంలో ఆదివారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, ఆశ్రమనిర్వాహకులు బాషాజాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యర్రావారిపాళ్యం:

మండలంలోని యల్లమంద పంచాయతీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత చెంగల్‌రెడ్డి విద్యా సామగ్రి, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆదివారం పాఠశాలలో ఫేర్వెల్‌డే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గుట్టకిందపల్లికి చెందిన బాడేపల్లి చెంగల్‌రెడ్డి విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటుగా చదువులో ప్రతిభ చూపుతున్న విదార్థికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో తన వంతు సాయంగా సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సైని స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:

సైని ప్రైమరీ స్కూల్ 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి డాక్టర్ శిరీష, జల్లి మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు విలువలు కూడా చాలా అవసరం అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అవసరమే, సాంకేతిక అనేది కొత్తదనానికి అవసరమే, కానీ సాంకేతిక ముసుగులో విలువలను మర్చిపోకూడదన్నారు. పిల్లలకు విద్య విజ్ఞానంతో పాటు విలువలు కూడా అవసరమేనన్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్ కరెస్పాండెంట్ గోపాల్ కృష్ణ, ఉషారాణి, హర్షని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్:

గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఒగ్గు భాస్కర్ దాతృత్వంతో 20మంది దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెలా 3వ ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు అందజేస్తున్నట్లు తెలిపారు. దాతగా వ్యవహరించిన ఒగ్గు భాస్కర్‌కి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, అశోక్, విష్ణు, జగదీష్, మధు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసాచారి, సురేష్, మురళీసింగ్, రెడ్ సంస్థ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

పేదల వైపే అతని చూపు.. అలుపెరగని ప్రజా సేవకుడు థామస్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: పేదల కుటుంబంలో పుట్టి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే స్థాయికి ఎదిగిన ఆయన పేదల వైపే చూస్తూ ప్రజా సేవకు ముందుకు సాగుతున్నాడు. ఆయనే జిడి నెల్లూరు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ థామస్. చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో కార్వేటినగరం మండలం అన్నూరు పంచాయతీ అల్లాగుంటకు చెందిన డాక్టర్ థామస్ 1974 జూన్ 28న గ్రామంలో జన్మించాడు. ఇతని తండ్రి ప్రకాశం, తల్లి రాణి , తమ్ముడు నీది ఎంబీఏ చదువుకొని చెన్నైలో ఫార్మ కంపెనీ నడుపుతున్నారు. తల్లిదండ్రులు కష్టపడి వి.ఎం థామస్ ను చదివించారు.

విద్యాభ్యాసం: ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు అన్నూరు గ్రామంలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఆరవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు పాదిరి కుప్పం జిల్లా పరిషత్ హై స్కూల్ లో చదువుకున్నారు. 8 , 9, 10వ తరగతి కొల్లాగుంట సిఎస్ఐ హైస్కూల్లో పూర్తి చేశారు. అనంతరం ఇంటర్మీడియట్ కార్వేటినగరం రాజా కుమారస్వామి రాజా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ విద్యను పూర్తి చేశారు. డిగ్రీ పుత్తూరులో ఎస్ఆర్ఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ఎమ్మెస్సీ ఎస్వీ యూనివర్సిటీలో బయో టెక్నాలజీ చదివారు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో పిహెచ్డి చదువు పూర్తి చేశారు. పీహెచ్‌డి పూర్తయిన తర్వాత చెన్నైలో కొంతకాలం వైద్య వృత్తిలో పనిచేశారు. తర్వాత కొంతకాలం విదేశాలకు వెళ్లి అక్కడ పనిచేశారు.

వైవాహిక జీవితం: డాక్టర్ థామస్ ఎంబీఏ చదువుకొని చెన్నైలో ఫార్మ కంపెనీ నడుపుతున్న రోజుల్లో చెన్నై లో పనిచేస్తుండగా తమిళనాడు దిండివనం ప్రాంతానికి వన్నె రెడ్డి సామాజిక వర్గానికి చెందిన శాంతితో పరిచయం ఏర్పడి , వారిద్దరూ ఒకరికొకరు ఇష్టపడ్డారు. ఆమెను 2023 డిసెంబర్ 24వ తేదీ కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమారులు ఇద్దరు పెద్ద కుమారుడు, రాహుల్ రామచంద్ర మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చదువుతున్నాడు. రెండవ కుమారుడు రోషన్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. 2010 సంవత్సరంలో చెన్నై నగరంలో సిఫ్పి చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ఆసుపత్రిని డాక్టర్ థామస్ ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలు ఇతర దేశాల్లో కూడా సిఫ్పి హాస్పిటల్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి ప్రపంచ వ్యాప్తంగా సుమారు 70 వేల మంది పిల్లలను టెస్ట్ ట్యూబ్ బేబీలు పుట్టించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ థామస్

రాజకీయ రంగ ప్రవేశం: టిడిపి ప్రజలకు చేస్తున్న సేవకు ఆకర్షితుడై టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి టిడిపి ఇన్‌ఛార్జిగా డాక్టర్ థామస్ ను నియమించడంతో రాజకీయం ప్రవేశం జరిగింది.

సేవా కార్యక్రమాలు: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, పాలసముద్రం, గంగాధర నెల్లూరు, పెనుమూరు, వెదురుకుప్పం ఆరు మండలాల్లో 'మీ ఇంటికి మీ థామస్ కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. గంగాధర నెల్లూరు మండలం వీరక నెల్లూరు గ్రామంలో తన సొంత నిధులతో గ్రామస్తులకు దాహం తీర్చేందుకు ఉచిత మినరల్ వాటర్ ప్లాంటేషన్ నిర్మించి ఇచ్చారు.

కుటుంబ వివాదాల్లోకి నన్ను లాగొద్దు: చైతన్య యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ఒక కుటుంబంలో జరుగుతున్న ఆస్తి వివాదంకు తనను ఆపాదించి పత్రికల్లో వార్తలు రాయడం తగదని వైసీపీ నాయకుడు కృష్ణ చైతన్య యాదవ్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ డబ్బులతో జరిగిన ఆస్తి అమ్మకంకు తనకు ఎటువంటి సంబంధం లేకపోయినా వార్తాపత్రికల్లో తానే వారిని బెదిరించి పంపివేసినట్టుగా రాశారని, వాస్తవానికి ఆ ఇంటి అమ్మకపు వ్యవహారానికి నాకు సంబంధించి ఎటువంటి సంబంధం లేదని, తన పేరు పెట్టి ఎలా ఆపాదించి రాశారని ప్రశ్నించారు. తిరుపతి శ్రీనివాసపురంలో కంకలపాటి శ్రీదేవి, ఆమె చిన్న కుమార్తె మధ్య కొంతకాలంగా ఆస్తి వివాదం జరుగుతోందని, ఈ క్రమంలో జరిగిన క్రయవిక్రయాలలో తన ప్రమేయం లేకపోయినా ఉందని చూపుతూ వార్తలు రాయడం మంచిది కాదని హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తనపై వార్తలు ప్రచురించిన పత్రికలపై పరువు నష్టం దావా వేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో మురళిరెడ్డి, ప్రదీప్, శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న చైతన్య యాదవ్